క్లుప్తంగా

అందుబాటులోకి అల్ట్రా సౌండ్ స్కానింగ్

నేడు ఎమ్మెల్యే సింహాద్రిచే ప్రారంభోత్సవం

అవనిగడ్డ: దివిసీమ ప్రజలకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. పదేళ్ల కిందట అవనిగడ్డలో సమగ్ర అత్యవసర ప్రసూతి, శిశు ఆరోగ్యకేంద్రం (సీమాంక్ సెంటర్)ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులు రూ.50 లక్షలతో నూతన అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఈ యంత్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించనున్నారు. దీంతో దివిసీమకు చెందిన గర్భిణులు, మహిళలకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

34 మందికి వైద్య పరీక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): సమగ్ర శిక్షా, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గ్రహణం మొర్రి నిర్ధారణ పరీక్షలు స్థానిక హైనీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ టి. జోషి, డాక్టర్ ఎన్. రాంబాబు, డాక్టర్ పి. విశ్వనాథ్ 34 మందికి పరీక్షలు చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన 14 మందిని బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. సమగ్ర శిక్షా ఏపీసీ డాక్టర్ ఎ. శేఖర్, సమగ్ర శిక్షా సహిత విద్య సహాయ సమన్వయకర్త కె. ఏడుకొండలు పాల్గొన్నారు.

అద్దంకి నాంచారమ్మ జాతర



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని అద్దంకి నాంచారమ్మ జాతర ఉత్సవాలను తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఉదయం ప్రధాన సెంటర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గుడి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బయటకు తీసి ఊరేగించారు. ఆలయ ధర్మకర్త, కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గురుప్రసాద్, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఆది రాంబాబు, అరజా లక్ష్మీ తులసీ, సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, ఉప సర్పంచ్ మండవ శివనాగమల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మోపిదేవి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. ఎంపీపీ రావి దుర్గా వాణి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండల స్థాయి అధికారులు తగిన సమాచారం రెండు సెట్లతో హాజరుకావాలని కోరారు.

సంపు నిర్మాణ పనుల పరిశీలన



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న ఖాళీస్థలంలో నిర్మిస్తున్న సంపు నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం పరిశీలించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాగం ధర్మరాజు నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను కిట్టుకు తెలిపారు. పురాతన ఆలయం పల్లంలో ఉండటంతో టెంకాయల నీరు, అభిషేక జలాలు బయట డ్రెయిన్‌లోకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో సంపులోకి తోడాల్సిన పరిస్థితి ఉందన్నారు. అందువల్ల ఆలయ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలంలో సంపు నిర్మాణ పనులు ప్రారంభించామని చెప్పారు. కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి చిత్తజల్లు రాజు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలం చిన్నాపురం గ్రామంలో జరుగుతున్న పేకాట శిబిరంపై బందరు రూరల్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. గ్రామంలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న బందరు డీఎస్పీ మాసూంబాషా ఆదేశాల మేరకు ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 17,150 స్వాధీనం చేసుకున్నారు. వీరిని శనివారం కోర్టుకు హాజరుపరుస్తారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడటౌన్(నందివాడ) : నందివాడలో నిర్మించి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. తొలుత అభిషేకాలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ తర్వాత భక్తులు దర్శనం చేసుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, దేశిరెడ్డి రామిరెడ్డి(అర్జున్‌రెడ్డి), దేశిరెడ్డి రామబ్రహ్మారెడ్డి, దేశిరెడ్డి వంశీధరరెడ్డి, ఆలయ అర్చకులు, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత దుక్కిపాటి శశిభూషణ్, వైస్ ఎంపీపీ పూడి సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సృజనకు పదును

- జెడ్పీహెచ్ఎస్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్
- వారంలో రెండు రోజులు క్లాసులు
- సృజనాత్మకత వెలికి తీయడమే లక్ష్యం
- ప్రాజెక్టులపై పెరుగుతున్న ఆసక్తి



విజయవాడ బుక్ ఫెస్టివల్‌లో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గూడూరు: సాంకేతికత విస్తరిస్తున్న ప్రస్తుత సమాజంలో పాఠశాల స్థాయి నుంచే పరిశోధనాత్మక విద్యను అందిస్తున్నారు. ఈ లక్ష్యంతో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు చిన్నారుల్లో సృజనాత్మకత వెలికితీయడానికి దోహదం చేస్తున్నాయి. గూడూరు జెడ్పీ హైస్కూల్‌లో 2019లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఏడు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు క్రమం తప్పకుండా వారంలో రెండు రోజులు ల్యాబ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా సైన్స్ ప్రాజెక్టులపై వారిలో ఆసక్తిని పెంపొందిస్తున్నారు. సైన్స్ మాస్టారు పీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుంటూ రోబోటిక్ ప్రాజెక్టులు చేస్తున్నారు. తాము చేసిన ప్రాజెక్టులను వివిధ ప్రాంతాల్లో ప్రదర్శిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇటీవలి కాలంలో మచిలీపట్నం లేడీయాంప్టిల్ కళాశాల, విజయవాడ బుక్ ఎగ్జిబిషన్ తదితర వేదికలపై పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలకు ప్రశంసలు లభించాయి.

రోబోటిక్ ప్రాజెక్టుల్లో కొన్ని ...

- పెద్ద పెద్ద హోటల్స్, ప్యాలెస్‌లు, బిల్డింగ్‌లను శుభ్రపరిచేందుకు ఫ్లోర్ క్లీనింగ్ రోబో
- కాళ్లు లేని వారు, నడవలేని వారి కోసం జాయ్‌స్టిక్ రోబో
- ఫ్యాక్టరీ, గోదాముల నుంచి సరుకులు డెలివరీ చేసేందుకు మనుషుల అవసరం లేకుండా లైన్ ఫాలోయింగ్ రోబో
- హోటల్స్, పార్టీలు, ఫంక్షన్లలో ఆహార పదార్థాలు సర్వ్ చేసేందుకు సర్వింగ్ రోబో
- కొండ ప్రాంతాల్లో ప్రయాణించేందుకు, ఎత్తు పల్లాలుగా ఉన్న ప్రదేశాల్లో ప్రయాణించే సమయంలో వాహనం ప్రమాదాల బారిన పడకుండా టేబుల్ టాప్ రోబో
- మహిళలు, వృద్ధులు వారి లగేజీని మోయాల్సిన అవసరం లేకుండా బటన్ సహాయంతో పనిచేసే స్మార్ట్ లగేజీ రోబో
- మనం ఇచ్చిన సందేశాలు విని వాటి ఆధారంగా పనులు చేసే వాయిస్ బేస్డ్ రోబో
- చిన్నారులు స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడకుండా వారిని ఆడించే మెమ్స్ బేస్డ్ రోబో.

ప్రత్యేక శ్రద్ధ



అటల్ టింకరింగ్ ల్యాబ్ మా పాఠశాలలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. దీనిని విద్యార్థులందరూ వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తూ సృజనాత్మకత ఉండే వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. వారు కొత్త ఆవిష్కరణలు రూపొందించేందుకు సహకరిస్తున్నాం. పరిసర ప్రాంతాల్లో ఎక్కడ సైన్స్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నా తప్పకుండా మా విద్యార్థులను తీసుకెళ్తున్నాం. ఫలితంగా వారిలో మరింత ఆసక్తి, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం.

– పీఎస్ ప్రసాద్, ల్యాబ్ ఇన్‌చార్జి

ఆసక్తి పెరిగింది



అటల్ టింకరింగ్ ల్యాబ్ కారణంగా పరిశోధనాత్మక విద్యపై ఆసక్తి పెరుగుతోంది. ప్రాజెక్టులు రూపకల్పన చేయడానికి ఉపాధ్యాయులు ఎంతగానో సహకరిస్తున్నారు. మా పాఠశాలలో ఇలాంటి ల్యాబ్ ఉండటం మా అదృష్టం.

– పోతన హర్షిణి, విద్యార్థిని 9వ తరగతి

ఆత్మస్థైర్యం పెరిగింది



పాఠశాలలో నేర్చుకున్న అంశాల గురించి వేరే వేదికలపై ప్రదర్శనలు ఇస్తుండటంతో ఆత్మస్థైర్యం పెరిగింది. మా ప్రదర్శనలు తిలకించడానికి వచ్చే వారి ప్రాజెక్టుల గురించి వివరించడం ఆనందాన్ని ఇస్తుంది. భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులకు ప్రేరణగా ఉంటోంది.

–షఫియా బేగం, విద్యార్థిని, 9వ తరగతి

అందరినీ ప్రోత్సహిస్తున్నారు



పరిశోధనాత్మక విద్యపై విద్యార్థులందరినీ ప్రోత్సహిస్తున్నారు. వారి ప్రోత్సాహంతోనే మేము చేస్తున్న ప్రాజెక్టులు అందరి మన్ననలు పొందుతున్నాయి. అందరికీ సమాన ప్రాధాన్యం ఇస్తుండటంతో మాలోని సృజనాత్మకత వెలికితీయడానికి అవకాశం లభిస్తోంది.

– పెరుమాళ్ల ఈశ్వర్, విద్యార్థి, 7వ తరగతి

ఇబ్బందులు లేకుండా పెన్షన్ తీసుకుంటున్నాం

పేర్ని కిట్టు వద్ద లబ్ధిదారుల ఆనందం



పేర్ని కిట్టుతో మాట్లాడుతున్న వృద్ధుడు

మచిలీపట్నంటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్లు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నారని వృద్ధులు, లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 24వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులు చాపల కృష్ణవేణి, ఉల్లి జగన్మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ సొమ్ము తీసుకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడేవారమని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎలాంటి ఇబ్బందులు లేవని, ఆయన పాలన బాగుందని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని ఆశీర్వదించారు. మొహమ్మద్ ఆశాబీ మాట్లాడుతూ తనకు వివిధ పథకాల ద్వారా మొత్తం రూ. 1,68,111, ఇంటిస్థలం మంజూరైందని చెప్పారు. పావని వీరవెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమకు వివిధ పథకాల ద్వారా రూ. 1,04, 458 అందాయన్నారు. కార్పొరేటర్ చిత్తజల్లు ప్రస న్న, డివిజన్ ఇన్‌చార్జి చిత్తజల్లు రాజు, కార్పొరేటర్లు రామిశెట్టి వాణిశ్రీ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీ లు బూరగ రామారావు, షేక్ బాషా, నాగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఆర్. ధర్మరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవల సూచిక బోర్డులు ప్రదర్శించాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలతో సూచిక బోర్డులను తప్పనిసరిగా ఆయా కార్యాలయాల్లో ప్రదర్శించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో శుక్రవారం పంచాయతీరాజ్, మునిసిపల్, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని సచివాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను ప్రదర్శించాలన్నారు. ఏ సేవకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎన్ని రోజుల్లో ధ్రువీకరణ పత్రం అందిస్తారో కూడా అందులో పొందుపరచాలన్నారు. పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో కూడా వీటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం అయిన ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందజేయాలని సూచించారు. డీఎల్‌పీఓ జ్యోతిర్మయి మాట్లాడారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వై. బాలసుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ ఐ. రాధిక, బీఎల్ సుధాకరరావు, జి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా ర్యాలీ



కోనేరుసెంటర్: ప్రకృతి వ్యవసాయంపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ శిక్షణ ప్రతినిధి క్రిస్సీ అన్నారు. బందరు మండలం కొత్తపూడి గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యమైన పద్ధతులు, నవధాన్యాల సాగుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. క్రిస్సీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమన్నారు. ఎరువులు, రసాయనాల వాడకం వలన ప్రజలు ఆరోగ్యపరంగా అనేక రుగ్మతలకు గురవుతున్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే పంటలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలు, నవధాన్యాల సాగుపై రైతులకు క్షుణ్ణంగా వివరించేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి రోజు కొత్తపూడి గ్రామంలో చేపట్టామన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ యాంకర్ స్వామిబాబు, రైతులు పాల్గొన్నారు.

న్యాయం, ధర్మం కోసం పోరాడిన ఇమామ్ హుసైన్

మచిలీపట్నంటౌన్: మహా ప్రవక్త హజ్రత్ మొహమ్మద్ ముస్తఫా రెండో మనుమడు హజ్రత్ ఇమామ్ హుసైన్ అలైహిస్సలామ్ శాంతి, న్యాయం, ధర్మం కోసం పోరాడారని పలువురు వక్తలు అన్నారు. షాబాన్ నెల మూడో రోజున మదీనాలో జన్మించిన హుసైన్ జన్మదినోత్సవాన్ని శుక్రవారం రాత్రి స్థానిక కోనేరు సెంటర్‌లో హుసైనీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మచిలీపట్నానికి చెందిన మతగురువు మీర్జా రాషిద్ హుస్సేన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ స్వామి సారంగ్ మోహిలీ, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ముస్లిం మత గురువులు సయ్యద్ అతీహర్ అబ్బాస్ జైదీ, షరఫ్ ఉత్రోల్వీ, మచిలీపట్నానికి చెందిన సయ్యద్ షాహ్ అబ్బాస్ జైదీ, మీర్జా అబిద్ అలీ మాట్లాడుతూ హుసైన్ జీవిత విశేషాలను వివరించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ కవులు జాఫర్ నసీరాబాద్, ఇరమ్ జాఫరి, డాక్టర్ అల్తాఫ్ కర్బలాయి, అస్గర్ మౌలాయిలు హుసైన్ జీవిత విశేషాలను కవితల రూపంలో వినిపించి సభికులను ఉత్సాహ పరిచారు. హుసైనీ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు అక్బర్ అలీ బేగ్, కార్యదర్శి అక్తర్ అబ్బాస్, కోశాధికారి షంష్ అబ్బాస్ తదితరులు పర్యవేక్షించారు.

ప్రతి గ్రామంలో ప్రభుత్వ భవనాలు



వేమవరప్పాడు పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజల ముంగిటకు తీసుకురావడానికి ప్రతి గ్రామంలోనూ నూతన ప్రభుత్వ భవనాలను ఏర్పాటు చేయిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. వేమవరప్పాడులో రూ.22 లక్షలతో శుక్రవారం నూతన పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నాలుగు మండలాల్లోనూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ నూతన భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు బోడావుల తిరుపతి రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చేబోయిన వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బత్రాజు శివాజీ, గ్రామ ఉపసర్పంచ్ జాజుల రాజు, స్థానిక పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు పేతురు, కుక్కల కృష్ణారావు, స్థానిక నాయకులు నున్న శ్రీనివాస్, బోడావుల సత్యనారాయణ, బత్రాజు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మండవల్లి: సైన్స్‌పై వ్యాస రచన పోటీలతో విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన కలుగుతుందని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూదాబత్తుల విజయ్‌కుమార్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో గ్రామీణ అభివృద్ధిలో సైన్స్ ప్రాముఖ్యంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండవల్లి, లింగాల, కానుకొల్లు, పుట్లచెరువు, ఇంగిలిపాకలంక, లోకుమూడి హైస్కూల్ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. ఐక్య వేదిక, సుధామ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్‌పై వ్యాసరచన పోటీలు జరిగాయి. టి.అప్పారావు, రిటైర్డ్ హెచ్ఎం కె.సూర్యారావు, హైస్కూల్ హెచ్ఎంలు ఎస్వై మాధవకుమార్, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం మధ్యాహ్నం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేవారు సెల్: 99592 25466 నెంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికుల అవసరాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

అథ్లెట్ అనురాధకు ఘన సన్మానం



పెడన: ఇటీవల కోల్‌కతా నగరం మిడ్నపూర్‌లో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో రజిత పతకం సాధించిన దక్షిణ తెలుగుపాలెంకు చెందిన బండారు అనురాధను శుక్రవారం స్థానిక సహాయ ఫౌండేషనఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక బట్టా జ్ఞాన కోటయ్య ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అనురాధ 400 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్‌లో పాల్గొని రజిత పతకం సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. మట్టా రాధాకృష్ణమూర్తి, ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్‌బాషా, సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

పామర్రు(పమిడిముక్కల): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, స్థానిక నేతలను కలుపుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చెప్పారు. పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. మండల పరిధిలోని సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులపై అధికారులతో చర్చించారు. మండలంలో డొంకదార్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేదసుప్రద, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీడీవో సుధా ప్రవీణ్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలు రాస్తే ఈనాడుకు శాస్తి తప్పదు

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నారాయణరెడ్డి

గుడివాడటౌన్ : వాస్తవాలు ప్రజలకు తీసుకెళ్లాల్సిన పత్రికలు తప్పుడు రాతలు రాస్తే శాస్తి తప్పదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు శుక్రవారం స్థానిక వాసవీచౌక్ సెంటర్‌లో ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాయకుడు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పిలుపు మేరకు కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి ఎల్లోమీడియా చేపట్టిన దుర్మార్గ చర్యలు పరాకాష్టకు చేరాయన్నారు. వాటిని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తొలుత వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుండి వాసవీచౌక్ వరకు రామోజీరావు, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు పాలేటి శివసుబ్రహ్మణ్యం (చంటి), మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహారావు, మెరుగుమాల కాళీ, షేక్ బాజీ, చుండూరి శేఖర్, బాబీ, మూడెడ్ల ఉమ, రమీజా, సునీత, హారిక, దేవి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

ఎంపీడీఓ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారావు

గూడూరు: గ్రామంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చొరవ తీసుకోవాలని గూడూరు ఎంపీడీఓ డి.సుబ్బారావు కోరారు. పోలవరం గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో గ్రామంలోని గృహ నిర్మాణాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. లే అవుట్లను మెరక చేయడంతో పాటు విద్యుదీకరణ పనులు ఇప్పటికే చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా సిబ్బంది వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, సర్పంచ్ నక్కిన నాగరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జోహన్నెస్ గూటెన్‌బర్గ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ప్రింటింగ్ ప్రెస్ సంఘ నాయకులు

మచిలీపట్నంటౌన్: ప్రింటింగ్ ప్రెస్ రూపశిల్పి జోహన్నెస్ గూటెన్‌బర్గ్ ఎంతో మంది ఉపాధికి బాటలు వేశారని నగరంలోని ప్రింటింగ్ ప్రెస్‌ల నిర్వాహకులు అన్నారు. జోహన్నెస్ గూటెన్‌బర్గ్ జయంతి కార్యక్రమం శుక్రవారం రామానాయుడుపేటలోని హనుమాన్ ప్రింటింగ్ ప్రెస్‌లో జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మచిలీపట్నం డివిజన్ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోసూరి లక్ష్మీనాంచారయ్య మాట్లాడుతూ జోహన్నెస్ గూటెన్‌బర్గ్ నాడు అక్షరాలతో ప్రింటింగ్ చేయడం కనిపెట్టి ప్రెస్‌ను నిర్వహించారని, ఆయన చేసిన ప్రయోగం మానవ చరిత్రలో ఒక మైలురాయిగా మిగులుతుందని వివరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు జల్లూరి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు అడ్డ కేదార్‌నాథ్, కమ్మిలి సత్యనారాయణ, కార్యదర్శి వడ్లమూడి సుబ్బారావు పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం



రీ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న డీఐఓ పైడిరాజు

గూడూరు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరమని సర్వే విభాగం బందరు డీఐ పైడిరాజు అన్నారు. గూడూరు మండలం గండ్రం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల ఆధునీకరణకు చేపట్టిన రీ సర్వేలో రైతుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. సర్వే సిబ్బంది పొలాలు సర్వే నిర్వహించే సమయంలో రైతులు ఖచ్చితంగా ఉండి సహకరించాలని ఆయన కోరారు. తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. మండల సర్వేయరు జి.వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పోలుకొండ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

గుడివాడటౌన్(నందివాడ): గుడివాడ– పోలుకొండ రహదారి అభివృద్ధి పనులకు శుక్రవారం సాయంత్రం భూమి పూజ చేశారు. ఎంపీపీ పెయ్యల ఆదాం సమక్షంలో తమిరిశ సర్పంచ్ తప్పిట ధనలక్ష్మితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఆదాం మాట్లాడుతూ గుడివాడ నుంచి పోలుకొండకు వెళ్లే ప్రధాన రహదారి లోని 2.5 కిలోమీటర్ల మార్జిన్ మరమ్మతులను రూ 2.96 కోట్లతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో రోడ్డు విస్తరణ నేపథ్యంలో పనులు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దాన్ని గమనించిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నిధులు మంజూరు చేయించి రోడ్డును 4 మీటర్ల నుంచి 7 మీటర్లకు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అలాగే గుడివాడ నుంచి పోలుకొండ వరకు గల 12.5 కిలోమీటర్ల రోడ్డును పునఃనిర్మిస్తారన్నారు.

కార్యక్రమంలో జేఈ ఆర్. మహీధర్ రెడ్డి, కె.రామస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు తప్పిట సొలోమన్‌రాజు, శేఖర్, గోవాడ అశోక్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

నిమ్మకూరు(పామర్రు): శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా సాగింది. టీటీడీ ఆధ్వర్యాన గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. పద్మావతి శ్రీనివాసుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.